సాక్షి కామారెడ్డి

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదవుతున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు.

- 8లో ▸



ఉపాధ్యాయుల పాత్ర కీలకం

సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /23.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

డీపీఆర్వోగా భీంకుమార్



కామారెడ్డి క్రైం: డీపీఆర్వోగా భీంకుమార్ నియమితులయ్యారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీపీఆర్వోగా పని చేసిన శాంతికుమార్ పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. దీంతో సిద్దిపేట డీపీఆర్వో రవికుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్‌లోని ప్రత్యేక కమిషనర్ కార్యాలయంలో డీపీఆర్వోగా పనిచేస్తున్న భీంకుమార్‌ను కామారెడ్డికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పౌరసరఫరాల శాఖ డీఎంగా రాజేందర్



కామారెడ్డి క్రైం: పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అభిషేక్ సింగ్ హైదరాబాద్ కమిషరేట్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు నెలలుగా ఏఎస్‌వో నిత్యానందం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన కూడా ఇటీవల జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో మేడ్చల్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా పనిచేస్తున్న రాజేందర్‌ను కామారెడ్డికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే ఉచిత శిక్షణ తరగతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ (13 రోజులు), సెల్‌ఫోన్ రిపేర్ (30 రోజులు), ఏసీ రిపేర్ (30 రోజులు)లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 45 సంవత్సరాలోపు వయస్సు కలిగి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులు మాత్రమే శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల యువకులు తమ ఆధార్, రేషన్‌కార్డు, ఐదు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ సౌకర్యం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రం, టూల్ కిట్ అందజేస్తామని, వివరాలకు 08461-295428 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా కాళోజీ జయంతి



కామారెడ్డి క్రైం: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కవి కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో రాజారాం, డీవైఎస్‌వో జగన్నాథం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కాళోజీ సేవలు చిరస్మరణీయం'



కామారెడ్డి అర్బన్: కాళోజీ తెలుగు భాషకు, తెలంగాణకు చేసిన చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య పేర్కొన్నారు. సోమవారం కళాశాలలోని బాలరాజ్‌గౌడ్ ఆడిటోరియంలో కాళోజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ తెలంగాణకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి పి.విశ్వప్రసాద్, అధ్యాపకులు రాజ్‌గంభీర్‌రావు, జయప్రకాష్, లక్ష్మణాచారి, రవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వేటు తప్పదా?



పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు కీలక ఆదేశాలు వెల్లడించింది. అనర్హత పిటిషన్‌లు స్పీకర్ ముందు ఉంచాలని, నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని పేర్కొంది. ఈ తీర్పు రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఫిరాయింపుల అంశంపై జిల్లాలో జోరుగా చర్చ సాగుతోంది.


- ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- ఫిరాయింపులపై హైకోర్టు ఆదేశాలతో రాజకీయ వర్గాల్లో సంచలనం
- ఉప ఎన్నికలపై జిల్లాలో జోరుగా చర్చ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పార్టీ ఫిరాయింపులపై బీఆర్‌ఎస్‌కు చెందిన నేతలు హైకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై విచారించిన రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం సోమవారం కీలక ఆదేశాలు ఇచ్చింది. అనర్హత పిటిషన్‌లను స్పీకర్ ముందు ఉంచాలని, నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని స్టేటస్ రిపోర్టు తమకు దాఖలు చేయాలని పేర్కొంది. "పిటిషన్‌లపై ఎప్పటిలోగా వాదనలు వింటాం. ఎన్నిరోజుల్లో విచారిస్తాం. తుది నిర్ణయం ఎప్పుడు తీసుకుంటాం అనే అంశాలపై షెడ్యూల్ ప్రొసిడింగ్స్ విడుదల చేయాలి. లేదంటే మేమే ఈ వ్యవహారాన్ని సుమోటోగా విచారిస్తాం" అని కోర్టు అసెంబ్లీ సెక్రెటరీని ఆదేశించింది. ఫిరాయింపులపై నాలుగు వారాల్లో స్పష్టత ఇవ్వాలని హై కోర్టు ఇచ్చిన ఆదేశాలు చర్చనీయాంశమయ్యాయి.

బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి మొన్నటి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచారు. ఆయన రెండు నెలల క్రితం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పెద్దాయనగా పేరున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ మారడమే అప్పట్లో పెద్ద సంచలనం కలిగించింది. ఆయన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా కొనసాగారు. అలాంటి పోచారం పార్టీ మారినపుడు అందరూ ఆశ్చర్యపోయారు. సీనియర్ నేత, గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రభుత్వం తగిన గౌరవం ఇస్తూ వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమించింది. త్వరలోనే

రాజకీయ ఉత్కంఠ

ఆయన బాధ్యతలు స్వీకరించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే పార్టీ ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాలన్న కోర్టు ఆదేశాలతో ఆయన భవితవ్యంపై జిల్లాలో చర్చ మొదలైంది. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తే బాన్సువాడలో ఉప ఎన్నిక వస్తుంది. అప్పుడు రాజకీయాలు ఎలా ఉంటాయన్న అంశంపై రాజకీయ వర్గాలలో చర్చ నడుస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం ఉప ఎన్నికలను సీరియస్‌గా తీసుకునే అవకాశాలున్నాయి. మరోవైపు బాన్సువాడలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. దీనికి తోడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం ఆ పార్టీకి మరింత బలాన్నిస్తుంది. అయితే ఇక్కడ పార్టీ రెండు వర్గాలుగా విడిపోయిన నేపథ్యంలో పరిస్థితి ఎలా మారుతుందన్న అంశంపైనా చర్చ సాగుతోంది. పార్టీ ఫిరాయింపులపై అసెంబ్లీ స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

ఈ నెలలో ప్రాజెక్టులోకి వచ్చిన ఇన్‌ఫ్లో..(టీఎంసీలలో)

తేది	ఇన్‌ఫ్లో	తేది	ఇన్‌ఫ్లో	తేది	ఇన్‌ఫ్లో
1	0.125	4	3.383	7	2.694
2	2.162	5	2.043	8	2.588
3	4.608	6	1.325	9	3.351

తొమ్మిది రోజులు.. 22.2 టీఎంసీలు

నిజాంసాగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈనెలలో 22.2 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఈ నెల 4న ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో అధికారులు గేట్లను ఎత్తి నీటిని మంజీర నదిలోకి విడిచిపెట్టారు. ఆరు రోజుల్లో 9.7 టీఎంసీల నీటిని మంజీర నదిలోకి వదిలారు.

వరద గేట్ల మూసివేత

ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను సోమవారం సాయంత్రం మూసి వేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1,404.64 అడుగుల(17.282 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 16 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు.

గురుకుల పాఠశాలలో వసతులపై ఆరా

బీబీపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలను వసతులున్న భవనంలోకి తరలించాలని కోరుతూ ఆదివారం విద్యార్థులు, తల్లిదండ్రులు నిర్వహించిన ధర్నాపై గురుకులాల ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి స్పందించారు. ప్రిన్సిపల్‌తో మాట్లాడి ప్రస్తుత పాఠశాలలోని వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాల భవనం ఇరుకుగా ఉన్నందున విద్యార్థులకు గదులు సరిపోవడం లేదన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, అన్ని వసతులు ఉన్న భవనం ఎక్కడ ఉన్నా మార్చడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, పక్కన మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కేవీఆర్

- ప్రపంచంలోనే పెద్ద పార్టీ బీజేపీ
- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్

కామారెడ్డి టౌన్: జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో జేపీఎన్ రోడ్‌లో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ అన్నారు. 2014నుంచి ఈ రికార్డు కొనసాగిస్తోందన్నారు. ప్రతి ఒక్కరిని కలిసి, బీజేపీ సిద్ధాంతాలను వివరించి పార్టీ సభ్యత్వం తీసుకునేలా చూడాలన్నారు. పార్టీ సభ్యత్వంలో దేశంలోనే కామారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉండేందుకు కృషి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కార్యకర్తలను కోరారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 200 చొప్పున సభ్యత్వం నమోదు చేయించాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం పార్టీ సభ్యత్వంపై కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఆన్‌లైన్‌లో సభ్యత్వం ఎలా తీసుకోవాలన్న అంశంపై పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార వివరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, రాష్ట్ర నాయకులు మురళీధర్ గౌడ్, రంజిత్ మోహన్, చిన్న రాజులు, రాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు లింగారావ్, శ్రీకాంత్, భరత్, నరేందర్, ప్రవీణ్, సురేశ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ అవుతున్న 'సింగితం'

- రిటెయినింగ్ వాల్ దెబ్బతినడంతో వృథా అవుతున్న నీరు

నిజాంసాగర్: సింగితం రిజర్వాయర్ ఖాళీ అవుతోంది. భారీ వరద రావడంతో వారం క్రితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీనికి మరమ్మతులు చేపట్టేందుకు రిజర్వాయర్ వరద గేట్లను ఎత్తి నీటిని ప్రధాన కాలువకు మళ్లిస్తున్నారు. దీంతో రిజర్వాయర్‌లోని నీరు ఖాళీ అవుతోంది. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ. 10 లక్షలు మంజూరయ్యాయని నీటి పారుదల అధికారులు తెలిపారు. ఆ నిధులతో మరమ్మతులు చేపట్టనున్నారు.



వరద తాకిడికి కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్

'సకాలంలో రుణాలను రెన్యువల్ చేయాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: పంట రుణం మాఫీ అయిన రైతులకు సంబంధించిన రుణాలను రెన్యువల్ చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రుణాల రెన్యువల్స్ జరుగుతున్న తీరుపై సమీక్షించారు. రుణాల రెన్యువల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 83 శాతం, టీజీబీ 81, కెనరా బ్యాంక్ 70, ఎస్‌బీఐ 40, డీసీసీబీ 39 శాతం మాత్రమే వృద్ధి సాధించాయని తెలిపారు. ఎస్‌బీఐ, సహకార బ్యాంకుల రెన్యువల్ శాతం మరింతగా పెంచాలని బ్యాంకర్లను ఆదేశించారు. సొసైటీల వారీగా రుణమాఫీ వివరాలు, పంట రుణాల రెన్యువల్స్ వివరాలను సమర్పించాలని జిల్లా సహకార అధికారిని ఆదేశించారు. పంట రుణాల రెన్యువల్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏవోలు, ఏఈవోలకు ఆదేశించారు. ఆధార్ నంబర్ సరిచేసుకోడానికి బ్యాంక్ నోడల్ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. సమావేశంలో డీఏవో తిరుమల ప్రసాద్, ఎల్‌డీఎం రవికాంత్, ఎస్‌బీఐ ఏజీఎం చంద్రశేఖర్, డీఎం శాండిల్య, డీసీసీబీ డీజీఎం సుమమాల, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

క్షణికావేశం.. అంతులేని విషాదం

- జిల్లాలో రోజుకొకరి చొప్పున బలవన్మరణం
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు చెందిన భూక్య ప్రశాంత్ (26) గతనెల 24వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న ప్రశాంత్.. కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు తీర్చే మార్గం తెలియక బలవన్మరణానికి పాల్పడ్డాడు.

ఎల్లారెడ్డి మండలం భిక్కనూర్ గ్రామానికి చెందిన రవి అనే యువకుడు కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది గతనెల 25న ఆత్మహత్య చేసుకున్నాడు.

మాచారెడ్డి మండలం సిక్కులోని లొద్ది తండాకు చెందిన నరేశ్ (23) అనే యువకుడు జూలై 30 న దుబాయిలో ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు చేసి దుబాయికి వెళ్లిన నరేశ్‌కు అక్కడ సరైన పని దొరక్కపోవడంతో మనస్తాపం చెంది జీవితాన్ని అర్ధంతరంగా ముగించాడు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: క్షణ కాలంలో ఏర్పడ్డ సమస్యకు పరిష్కారం వెతకలేక ఉరితాడును వెతికేవారు కొందరైతే.. చిన్న కష్టాన్ని కూడా తట్టుకోలేక పురుగుల మందును ఆశ్రయించేవారు మరికొందరు... ఉద్యోగం రాలేదని నిరుద్యోగి, పరీక్ష తప్పానని విద్యార్థి, ప్రేమ విఫలమైందని ప్రేమికులు, అప్పు తీర్చలేకపోయానని రైతు, భర్త అనుమానించాడని భార్య, తల్లిదండ్రులు మందలించారని పిల్లలు, బిడ్డల నిర్లక్ష్యానికి గురయ్యామని తల్లిదండ్రులు.. ఇలా జిల్లాలో ఎక్కడోచోట రోజుకొకరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. చాలావరకు చిన్నచిన్న కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా యువత క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలతో కన్నవారికి కడుపుకోత మిగిలిస్తున్నారు. ప్రతి మనిషికి ఏదో ఒక సమస్య ఉంటుంది. ఆ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో ఆలోచించుకోవాలి. ఏ సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాదన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. కుటుంబ సభ్యులు లేదా స్నేహితులు, ఆత్మీయులతో చర్చిస్తే పరిష్కార మార్గాలు లభిస్తాయి. కానీ చాలామంది అవేమీ ఆలోచించకుండా చావు మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీంతో వారి జీవితం అర్ధంతరంగా ముగిసిపోతోంది. వారిపై ఆధారపడ్డ తల్లిదండ్రులు, భార్య, పిల్లలు రోడ్డున పడుతున్నారు.



కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 26 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. సదాశివనగర్, రామారెడ్డి పోలీస్ స్టేషన్ల పరిధి చాలా చిన్నది. సదాశివనగర్‌లో 18 మంది, రామారెడ్డిలో 17 మంది చనిపోయారు. లింగంపేటలో కూడా ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. మారుమూల ప్రాంతమైన జుక్కల్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద మండలాల్లో ఆత్మహత్యలు తక్కువగా నమోదవుతున్నాయి. ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి సారించి, కారణాలను అన్వేషించి నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో ఈ ఏడాది పోలీస్ స్టేషన్‌ల వారీగా నమోదైన ఆత్మహత్యలు..

పోలీస్‌స్టేషన్	ఆత్మహత్యలు	పోలీస్‌స్టేషన్	ఆత్మహత్యలు
దేవునిపల్లి	26	బీబీపేట	10
బాన్సువాడ	24	బీర్కూర్	09
కామారెడ్డి	18	మాచారెడ్డి	09
సదాశివనగర్	18	నిజాంసాగర్	08
రామారెడ్డి	17	మద్నూర్	07
పిట్లం	15	ఎల్లారెడ్డి	07
లింగంపేట	12	గాంధారి	05
నాగిరెడ్డిపేట	12	రాజంపేట	04
భిక్కనూరు	12	జుక్కల్	02
దోమకొండ	11	పెద్దకొడప్‌గల్	02
నస్రుల్లాబాద్	11	బిచ్కుంద	02
తాడ్వాయి	11	మొత్తం	252

డిప్రెషన్‌తోనే ఆత్మహత్యలు



నిరాశ, నిస్పృహలకు లోనయినపుడు సమస్యలను బట్టి మెదడులో రసాయనాలు తగ్గుతూ పెరుగుతుంటాయి. దాని కారణంగా జీవితంపై నమ్మకం కోల్పోవడం, విరక్తి చెందడం, అతిగా ఆలోచించడం జరుగుతుంది. నలుగురిలో కలవలేకపోవడం, ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం, అదే పనిగా ఆత్మహత్యలకు సంబంధించిన విషయాలు మాట్లాడడం, సోషల్ మీడియాలో వాటి గురించి అన్వేషించడం, సరిగ్గా నిద్రపోకపోవడం, సమయానికి తినకపోవడం, తాను ఈ లోకంలో లేకపోతే బాగుంటుందని, భారంగా మారానని అనే మాటలను తరచుగా ఉపయోగిస్తుంటే కుటుంబ సభ్యులు గమనించి ఒత్తిడిని దూరం చేయడానికి ప్రయత్నించాలి. ఇలాంటి సమస్యలతో బాధపడుతున్నవారికి జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో నిరంతరం సేవలు అందిస్తున్నాం. ఆత్మహత్యల నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– రమణ, మానసిక వైద్యులు, కామారెడ్డి

క్లుప్తంగా

13న జిల్లా జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్ : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న శుక్రవారం ఉదయం 8గంటలకు స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లాస్థాయి జూనియర్స్ అండర్–14, 16, 18, 20 బాలబాలికలకు వివిధ అంశాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. రన్స్, త్రోస్, జంప్స్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో ఎంపికలుంటాయని,క్రీడాకారులు తమ పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేదా ఆధార్ లేదా ఎస్సెస్సీ మార్కుల జాబితా తీసుకురావాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూచించారు.

ప్రథమ చికిత్స కేంద్రాలపై దాడులు ఆపాలి



కామారెడ్డి టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న పీఎంపీ, ఆర్‌ఎంపీల ప్రథమ చికిత్సాలయాలపై దాడులు ఆపాలని జిల్లా ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 నెలలుగా అన్ని గ్రామాల్లో దాడులు జరుపుతూ తమ ప్రథమ చికిత్సాలయాలను సీజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజక్షన్‌లు, సెలైన్‌లు, చిన్నచిన్న గాయాలకు పట్టీలు కట్టడం లాంటివి మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ, ఆర్‌ఎంపీలు రాజేశ్వర్‌రావు, దేవయ్య, రాధకృష్ణ, కృష్ణ, విఠల్, సముద్రం, రాజయ్య, మాణిక్యం తదితరులున్నారు.

పీఎస్‌హెచ్‌ఎంఏ నూతన కార్యవర్గం

కామారెడ్డి టౌన్ : తెలంగాణ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంఘం(టీజీపీఎస్‌హెచ్‌ఎంఏ) జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రతినిధులు మురళీధర్ గౌడ్, నరేష్ కుమార్, గాలయ్యల సమక్షంలో ఎన్నుకుని ప్రకటించారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా నునవత్ లచ్చిరాం నాయక్, అధ్యక్షులుగా ఇందూరి రమేష్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పందిరి రాజేశ్, ఉపాధ్యక్షులుగా గట్టుకింది శ్రీహరి, లక్ష్మి, కార్యదర్శులుగా పాత అశోక్ కుమార్, భూక్యాసరోజిని, కోశాధికారిగా నాంపల్లి తదితరులున్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 114 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 114 ఫిర్యాదులు రాగా వాటిలో 56 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు చెందిన సమస్యలే కావడం గమనార్హం. మిగితావి ఆయా శాఖలకు చెందిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీవో సురేందర్, ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలి

తన ఇంటికి ఆనుకుని చేపట్టిన అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలని భిక్కనూర్‌కు చెందిన బుర్ల శ్రావణ్ కుమార్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. వెంకటేశం అనే వ్యక్తి అక్రమ కొలతలు సృష్టించి జీపీ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం జరిపాడన్నారు. ఆ నిర్మాణం కారణంగా తన ఇల్లు కూలిపోయే స్థితిలో ఉందన్నారు.



వేతనాలు చెల్లించాలి..

20 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లుగా పని చేస్తున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం స్వీపర్లు కోరారు. వారు సోమవారం ప్రజావాణికి తరలివచ్చారు. ఏళ్లగా ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో పని చేస్తున్న తమకు రూ.4 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నామని వాపోయారు. ఫుల్‌టైం స్వీపర్లుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం రూ.27 వేలు చెల్లించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు.

‘పత్తి’కి కష్టమొచ్చింది..



తిర్మన్‌పల్లి శివారులో దెబ్బతిన్న పత్తి మొక్కలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ఇటీవల కురిసిన వర్షాలు రైతుల కష్టానికి ఫలితం లేకుండా చేశాయి. వర్షాల కారణంగా పత్తి చేళ్లలోకి విపరీతంగా వరద నీరు వచ్చి చేరడంతో మొక్కలు పూర్తిగా కుళ్లి పోయి పూత, కాత లేకుండా మురిగిపోయింది. మండలంలోని తిర్మన్‌పల్లి, మర్కల్ గ్రామాల శివారులో రైతులు అత్యధికంగా పత్తి పంటను సాగు చేశారు. కానీ వర్షాలు పత్తి రైతులను ఆందోళన కలిగించే విధంగా వర్షాలు కురియడంతో అయోమయ స్థితిలో పడ్డారు. సంబంధిత వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి పరిహారం వచ్చేలా కృషి చేయాలని వారు కోరుతున్నారు.

తెగుళ్లతో జాగ్రత్తలు అవసరం



బాన్సువాడ రూరల్ : ఎడతెరిపి లేకుండా కురిసిన వానలు, రోజుల తరబడి ఆకాశం ముసురేసి ఉండటంతో పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. మండలంలోని కొయ్యగుట్ట, బోర్లం, ఇబ్రాహింపేట్, పోచారం, రాంపూర్, దేశాయిపేట్ గ్రామాల శివార్లలో సాగుచేసిన వరిపంటకు ఎండాకు తెగులు ఆశించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు నష్టపోకుండా సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టెక్సాస్‌లో జుక్కల్ ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్): లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భాగంగా సోమవారం టెక్సాస్‌లో యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశమయ్యారు. రాహుల్ గాంధీతో పాటు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు విద్యార్థులతో సమావేశం ప్రసంగించారు. రాహుల్ గాంధీతో పాటు విదేశీ పర్యటన చేస్తూ భారతీయ విద్యార్థులతో భేటీ అవ్వడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ద్వితీయ స్థానంలో నిలిచిన స్ప్రింగ్ ఫీల్డ్ స్కూల్ జట్టు

మాచారెడ్డి : క్రీడల్లో గెలుపోటములు సహజమని పాల్వంచ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం పాల్వంచలో నిర్వహించిన 34వ సబ్ జూనియర్ బాలుర, బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో టోర్నమెంట్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ టోర్నమెంట్‌లో 38 బాలుర, 22 బాలికల జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి అతికుల్లా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ రాధ, అసోసియేషన్ ప్రతినిధులు నాగేశ్వర్ రావు, మధుసూదన్ రెడ్డి, మోహన్ రెడ్డి, అనిల్ కుమార్, భాస్కర్ రెడ్డి గోపిరెడ్డి, రాజా గౌడ్,శ్రీధర్, ఉన్నారు.

ఖోఖో టోర్నీ విజేతలు వీరే..

పాల్వంచ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఖోఖో టోర్నీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విజేతలు వీరే..

బాలికల విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ రాంపూర్ జట్టు ప్రథమ స్థానం. స్ప్రింగ్ ఫీల్డ్ ఉన్నత పాఠశాల సదాశివనగర్ ద్వితీయ, జెడ్పీహెచ్‌ఎస్ శెట్‌పల్లి తృతీయ స్థానంలో నిలిచారు.

బాలుర విభాగంలో..

టీజీ ఎమ్మార్‌ఎస్‌జేసీ చందూర్ ప్రథమ, టీజీఆర్ఎస్ మద్నూర్ ద్వితీయ, టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ ఎల్లారెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : జిల్లాస్థాయి ఖో–ఖో టోర్నీలో తృతీయ స్థానంలో నిలిచిన లింగంపేట మండలం శెట్పల్లి బాలికల జట్టును హెచ్‌ఎం సునంద, పీఈటీ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పార్కింగ్ కోసం స్థల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్ ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న పర్యాటకుల వాహనాల పార్కింగ్ కోసం సోమవారం మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు స్థలాన్ని పరిశీలించారు. పర్యాటకులు తమ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ మండల నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే నిజాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన స్థలాన్ని చదును చేసి, వాహనాల పార్కింగ్ చేయించాలన్నారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, ఎలే మల్లికార్జున్, ఎంపీడీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి రవిరాథోడ్ తదితరులు ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్‌లో సోమవారం 43వ ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 50 మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేశ్, బీ శ్యామ్ తెలిపారు. సికింద్రాబాద్‌లో ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి రాజేశ్వర్, సభ్యులు సురేశ్, గీత, పీఈటీలు నరేంద్రాచారి, మాధురి, సాయిలు, సాయినాథ్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ అధికారులు గోదావరిలోకి నీటి విడుదలను నిలిపివేశారు. సోమవారం రాత్రి 7 గంటలకు గేట్లను మూసివేశారు. సోమవారం ఉదయం నుంచి ప్రాజెక్ట్‌లోకి క్రమంగా ఇన్‌ఫ్లో తగ్గడంతో వరద గేట్ల ద్వారా నీటి విడుదలను సైతం తగ్గించారు. మధ్యాహ్నం నుంచి 5 గేట్ల ద్వారా 15,620 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిన అధికారులు రాత్రికి పూర్తిగా నిలిపేశారు. క్రితం రోజు లక్ష 26 వేల క్యూసెక్కుల వరద గరిష్టంగా వచ్చింది. క్రమంగా సోమవారం ఉదయం నుంచి తగ్గుతూ వచ్చింది.

ముంపునకు గురైన పంటల పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలో నీటమునిగిన పంటలను సోమవారం ఎల్లారెడ్డి ఏడీఏ లక్ష్మీప్రసన్న పరిశీలించారు. ‘సాక్షి’లో ఈనెల 9న ‘ముంపునకు గురైన పంటలు’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈ మేరకు మండలంలోని చీనూర్, వాడి గ్రామాలలో పర్యటించి నీటమునిగిన పంటలను పరిశీలించారు. దీంతోపాటు నిజాంసాగర్ ప్రాజెక్టు ఏఈ శివకుమార్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. పంటలు నీటమునిగిన రైతులతో ఆమె మాట్లాడారు. రెండురోజుల్లో పంటపొలాల్లోని నీరు వెనక్కి వెళ్లిపోతుందని, ఆందోళన చెందవద్దన్నారు. ఆమె వెంట ఏవో హరి వెంకట ప్రసాద్ ఉన్నారు.

బుంగ పూడ్చివేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బంజర నుంచి లింగంపల్లికలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన బుంగను సోమవారం ఇరిగేషన్ అధికారులు పూడ్చి వేయించారు. ‘సాక్షి’లో ఈనెల 9న ‘కుంగిన లింగంపల్లి కలాన్ రోడ్డు’ శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎల్లారెడ్డి ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు ఘటనస్థలానికి చేరుకొని రోడ్డుపై ఏర్పడిన బుంగను పరిశీలించారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో జేసీబీతో బుంగను పూడ్చివేయించారు. జీపీ కార్యదర్శి వనజ, ఇరిగేషన వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు..



ఎల్లారెడ్డి : పట్టణంలోని 2వ వార్డులో వంగిన విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు సోమవారం సరిచేశారు. సోమవారం ‘సాక్షి’లో ప్రచురితమైన ‘ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం’ కథనానికి స్పందించి కాలనీలో వంగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

బాల్కొండ: మెండోరా మండలం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగున గోదావరిలో ఆదివారం గల్లంతైన ముంబైకి చెందిన ఫిరోజ్(28) మృతదేహం సోమవారం లభ్యమైంది. జగిత్యాల జిల్లా కోరుట్లలోని బంధువుల ఇంటికి వచ్చిన ఫిరోజ్ ఆదివారం మిత్రులతో కలిసి ప్రాజెక్ట్‌ను సందర్శించేందుకు వచ్చి నీటిలో గల్లంతయ్యాడు. ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా నీటి విడుదల తగ్గుముఖం పట్టడంతో చేపల వేటకు వెళ్లిన జాలరులకు గల్లంతైన ప్రదేశం నుంచి కొద్ది దూరంలో మృతదేహం కనిపించడంతో మెండోరా ఎస్సై నారాయణకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న ఓ దుకాణం ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుందని, మృతుడు రైలులో తినుబండారాలు అమ్ముకుంటూ జీవించేవాడని స్థానికులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని శివారు ప్రాంతమైన ఆదర్శనగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కాలనీకి చెందిన నంబగారి వికాస్ ఈ నెల 6న ఇంటికి తాళం వేసి స్వగ్రామమైన చిన్న శంకరంపేట మండలం ఖాజాపూర్ గ్రామానికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడంతోపాటు ఇంట్లోని సామాన్లు, బీరువా చిందరవందరగా చేసి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. బీరువాలో దాచి ఉంచిన రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.45వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఆవు చోరీకి యత్నం



ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న కొట్టంలోనుంచి దుండగులు ఆవును చోరీ చేసేందుకు యత్నించారు. ఆదివారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆవుకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి అది అపస్మారక స్థితిలోకి వెళ్లగానే ఇన్నోవా కారులోకి ఎక్కించే ప్రయత్నం చేస్తుండగా గో సేవకులు అప్రమత్తమై వెంబడించడంతో దుండగులు ఆర్‌ఆర్ చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా పరారయ్యారు. గోసేవకులు ఘాజిరెడ్డి హరీశ్‌రెడ్డి, అంతరెడ్డి సంపత్, సాయి, వర్ధన్, మణికంఠ, రింకు.. విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్‌కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న రమేశ్ వెంటనే డయల్ 100కు కాల్ చేశారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఎస్సై, పోలీసు సిబ్బంది వచ్చి ఆవుని చూసి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. గో సేవకులు నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని గో సేవకులు పోలీసులను కోరారు.

రెచ్చిపోయిన పిచ్చికుక్కలు

- నందిపేట్, మాచారెడ్డి మండలాల్లో 20 మందికి గాయాలు
- జిల్లా కేంద్ర ఆస్పత్రులకు బాధితుల తరలింపు



బాధితుల కాళ్లు, చేతులపై గాయాలు

ఉమ్మడి జిల్లాలోని నందిపేట్ మండల కేంద్రంతోపాటు మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం)లో పిచ్చి కుక్కలు రెచ్చిపోయాయి. సోమవారం ఉదయం ఆయా చోట్ల స్వైర విహారం చేస్తూ 20 మందిని గాయపర్చాయి. తీవ్రగాయాలపాలైన వారిని నిజామాబాద్, కామారెడ్డి జిల్లా ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు.

నందిపేట్‌లో..

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని రామ్‌రెడ్డి వెల్డింగ్ షాప్ నుంచి మెయిన్ రోడ్డు వెంబడి లిటిల్ ఫ్లవర్ స్కూల్, చాకలి ఐలమ్మ, ఆనంది హాస్పిటల్, వ్యాన్ల అడ్డా, నటరాజ్ టాకీస్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో పది మందిపై పిచ్చికుక్క దాడి చేసింది. ఈ ఘటనలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థితోపాటు ఆనంద్ ఆస్పత్రి ఆయమ్మ లసుంబాయికి తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం లసుంబాయిని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ తెలిపారు. అధికారులు, వీడీసీ తగిన చర్యలు చేపట్టి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘన్‌పూర్‌లో..

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్(ఎం)లో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ పిచ్చికుక్క పదిమందిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన కళావతి అనే మహిళ కిరాణా షాపునకు వెళ్తుండగా కొద్ది దూరం వెంబడించి కరిచింది. అలాగే అక్షిత అనే బాలిక బయటకు వెళ్తుండగా దాడి చేసింది. మధ్యాహ్నం ఆరుబయట నిద్రిస్తున్న పోచయ్య అనే వృద్ధునితోపాటు యాకూబ్, చైతన్య, ఆర్యన్, రంజిత్ దాడి చేయడంతో గ్రామస్తులు కుక్కను వెంబడించి చంపేశారు. బాధితులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. తీవ్రగాయాలపాలైన వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

నగల కోసం వృద్ధురాలిపై హత్యాయత్నం

గాంధారి(ఎల్లారెడ్డి): నగలు, డబ్బుల కోసం వృద్ధురాలిపై ఓ వ్యక్తి హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని పొతంగల్ కలాన్‌లో ఆదివారం చోటు చేసుకుందని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఒంటరిగా ఉండే భూమవ్వ కూలీ పనులు చేసుకుంటూ డబ్బులు కూడ బెట్టి బంగారు నగలు చేయించుకుని ధరించింది. ఆమె ధరించిన నగలు, దాచుకున్న డబ్బులపై కన్నేసిన విఠల్ ఆదివారం మధ్యాహ్నం ఆమెను తన ఇంటికి పిలిచాడు. కుర్చీ లో కూర్చున్న ఆమె మెడకు వెనుక నుంచి తాడు బిగించాడు. వృద్ధురాలు కేకలు వేయంతో చుట్టుపక్కల వారు వచ్చి ఏం జరిగిందని ప్రశ్నించగా, ఏమీ లేదని విఠల్ బుకాయించే ప్రయత్నం చేశాడు. కాలనీ వాసులు అనుమానంతో ఇంట్లో వెతుకగా వృద్ధురాలు అపస్మారక స్థితిలో పడి ఉంది. కాలనీ వాసులు వృద్ధురాలిని చికిత్స నిమిత్తం గాంధారి ఆస్పత్రికి తరలించారు. కోలుకున్న వృద్ధురాలు గ్రామస్తులతో కలిసి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు.

నివాసపు గుడిసె దగ్ధం

- రూ.1.30 లక్షల ఆస్తి నష్టం
- భర్త దశదిన కర్మకోసం దాచుకున్న డబ్బులు బుగ్గిపాలు

ధర్పల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి నివాసపు గుడిసె, అందులోని నగదు, సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని కొట్టాలపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొత్తపల్లి లక్ష్మి భర్త, కుమారుడితో కలిసి పూరిగుడిసెలో నివాసం ఉంటోంది. ఆమె భర్త కొత్తపల్లి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా గుడిసెకు నిప్పంటుకుంది. గుడిసెలో ఉన్న తల్లీకొడుకు బయటికి పరిగెత్తి కేకలు వేయడంతో చుట్టు పక్కలవారు వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే సామగ్రితోపాటు బియ్యం, నగదు కాలిబూడిదయ్యాయి. భర్త దశదిన కర్మకోసం దాచుకున్న డబ్బులు పూర్తిగా కాలిపోయాయని బాధితురాలు బోరున విలపించింది. ఘటనాస్థలాన్ని ఆర్‌ఐ రాజేశ్వర్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.1.30 లక్షల ఆస్తి నష్టం జరిగిందని తహసీల్దార్ మాలతి తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి



మోర్తాడ్: మండలంలోని శెట్‌పల్లిలో స్వాతంత్య్ర సమరయోధురాలు మంగలి రాజుబాయి (101) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్య్రం వచ్చిన రోజు శెట్‌పల్లిలో జెండా ఎగురవేసి స్వాతంత్య్రదినోత్సవాన్ని నిర్వహించిన ఈ ప్రాంత తొలి మహిళగా రాజుబాయి గుర్తింపు పొందింది. ఆమె తన భర్తతో స్వాతంత్య్ర సంగ్రామంలో పాల్గొని గుర్తింపు పొందారు. రాజుబాయి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తి చేశారు. అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించకపోవడం స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పులాంగ్ వాగులో కొట్టుకొచ్చిన మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దత్తాత్రేయ స్వామి ఆలయం వెనుక ప్రాంతంలో ఉన్న పులాంగ్ వాగు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని బయటికి తీయించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని, చేయిపై అమ్మ అనే పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్సై (87126 59840), సీఐ (87126 59836)ను సంప్రదించాలని కోరారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

సిరికొండ: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన తీనేటి బుచ్చారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి బుచ్చారెడ్డి ఇంట్లో గొడవ చేస్తున్నాడని డయల్ 100కు కాల్ రాగా.. సిబ్బంది అక్కడికి వెళ్లారని ఎస్సై తెలిపారు. సముదాయిస్తున్న పోలీసులతో మద్యం మత్తులో ఉన్న బుచ్చారెడ్డి దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్లు, నగదు చోరీ

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన సాయిలు నివాసపు గుడిసెలో ఆదివారం రాత్రి చోరీ జరిగిన ట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. సాయిలు ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రిస్తుండగా, దుండగుడు గుడిసెలోకి చొరబడి రూ.5వేల నగదు, ఏటీఎం కార్డులను ఎత్తుకెళ్లాడు. అలికిడికి మెళకువ రావడంతో సాయిలు దుండగుడి వెంట బడినప్పటికీ చిక్కలేదు. బాధితుడి ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.